# రెండో మనిషి

నిమ్మలపూడి రమేష్‌కుమార్

**గతంతో పోలిస్తే నా విలువ ఎంత తగ్గిపోయిందో స్పష్టంగా అర్థమవుతోంది.**

**రత్నానికి, నాకూ ఉన్న అభిమానం, ఆప్యాయతలు పిల్లల ఎదుగుదలతో చిక్కిశల్యమవుతున్నాయి. అవును... నిజమే!**

**వాళ్ళు ఎదుగుతోన్న కొద్దీ రత్నానికి నా మీద ప్రేమ తగ్గిపోతోంది.**

వేదమంత్రాల మధ్య మూడు ముళ్ళు వేసి తను అర్ధాంగిగా చేసుకున్న రత్నమే నన్నే నిర్లక్ష్యం చేస్తుంది.

నా వల్ల ఎలాంటి సంపాదన లేదనే కదా! అప్పుడే నేను బరువైపోయానా? నన్ను పట్టించుకోవడంలో చాలా తేడా చూపిస్తోంది. నా గురించి ఆలోచించడంలో చాలా తేడా కనిపిస్తోంది. ఉద్యోగం చేసినన్నాళ్ళు టైం ప్రకారం భోజనం చెయ్యకపోయినా, రాత్రిళ్ళు ఎక్కువగా మెలకువగా ఉన్నా, ఆరోగ్యం పాడయిపోతుందని, హడావుడిగా నన్ను హెచ్చరిస్తూ ఎంతో లాలనగా చూసుకునేది అలాంటిది యిప్పుడు రిటయ్యరయ్యానని చులకన కాబోలు! అవును... ఈ సమస్యకు సరైన పరిష్కారం ఆలోచించాలి.

రకరకాలుగా ఆలోచిస్తున్న నాకు తెలియకుండానే కళ్ళల్లో నీళ్ళు నిలువలేమన్నట్లుగా ముఖం మీదికి జారిపోతున్నాయి.

"నన్ను నేను ఎంతకాలం సమర్థించుకోను...? అలాగని ఎక్కువ కాలం ఈ బాధని భరించే శక్తి ఈ వయస్సులో అనుభవించలేను. నేను మళ్ళీ విలువగల వ్యక్తిగా ఈ ఇంట్లో గుర్తింపబడాలి..." అలా నాలో నేను ఆలోచిస్తుండగానే, నా భార్య రత్నం వస్తున్న అలికిడి విని అప్రయత్నంగా భుజం మీది కండువా తీసి మొహం తుడుచుకున్నాను.

" ఏమండీ! అలా ఉన్నారేం? ఒంట్లో నలతగా ఉందా?" నా ముఖంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ అడిగింది రత్నం.

ఏం చెప్పను ?

నా మనసులో రేగిన అనుమానాన్ని చెప్పి, ఆమెను బాధపెట్టేకన్నా నిశ్శబ్ధంగా ఉండటం మంచిదనిపించి, వెంటనే ముఖంలో నవ్వు తెచ్చిపెట్టుకొని, అతికష్టం మీద "ఏమీ లేదే!" అని మాత్రం చెప్పగలిగేను.

కానీ -

అలా చెప్పినందుకు " మీరు ఏదో దాస్తున్నారు. నిజం చెప్పరూ !" అని బతిమాలుతుందేమోనని ఎదురు చూశాను.

ఆశించిన సమాధానం రాకపోగా, ఆమె మాత్రం తిరిగి వెళ్తూ చెప్పింది. "స్కూలు విడిచే వేళవుతోంది. వెళ్ళి హారికని తీసుకురండి."

ఆమె సౌమ్యంగానే చెప్పినా నాకదే ఆజ్ఞలా అనిపించింది. నిస్సహాయంగా కుర్చీలోంచి లేచిన నాకు కళ్ళు తిరిగినట్లయింది. అంతలోనే తేరుకొని స్కూలు దగ్గరికి బయలుదేరాను. మా ఇంటికి ఓ మైలు దూరంలో ఉన్న స్కూలు దగ్గరికి చేరుకునేసరికి నాకు కాళ్ళు పట్టేశాయి.


మా చుట్టుపక్కల పిల్లలంతా రిక్షాల్లో వెళ్తున్నారు. నెలకి 50 రూపాయలు యిస్తే నా మనుమరాలు హారిక రిక్షా మీద వెళ్ళి వచ్చేది. నాకీ శ్రమ తప్పేది.

ఇదే మాట ఓ రోజు పెద్దోడితో అంటే " ఇది చదివే చదువుకి రిక్షా కూడానా ? మీరెలాగూ ఉన్నారు కదూ! ఆ మాత్రం తీసుకెళ్ళి, తీసుకురాలేరు ?" అంటూ నాకే ఎదురు మాటలు చెప్పబోయిన పెద్దోడిని ఏమనాలో తోచలేదు.

నేనెలా చస్తే వీడికేం ? రెక్కలు ముక్కలు చేసుకుని పెంచానన్న కృతజ్ఞత ఏమైనా ఉంటేనా ? వాడు ఓ ఇంటివాడయ్యాడు. స్వంత నిర్ణయాలు తీసుకుంటూ నా బాధల్ని పక్కకు నెట్టస్తున్నాడు. స్కూల్ గేటు దగ్గర నిలబడిన నేను, పిల్లల కేరింతలతో ఆలోచనల నుండివాస్తవంలోకి వచ్చాను.

"తాతయ్యా!" అంటూ నా దగ్గరికి పరిగెత్తుకుంటూ వచ్చింది నా మనుమరాలు హారిక.

నేను దాన్ని చూడగానే నవ్వుతూ, దాని చేతిలో



ఉన్న బ్యాగ్‌ను తీసుకొని ఇద్దరం ఇంటికి బయలు దేరాం.

సంతోషంగా ఉందామని ఎంత ప్రయత్నించినా ఇంట్లో అందరి ప్రవర్తనలూ, చూపులూ తీక్షణంగా నా మనసును గుచ్చుతున్నట్లుగా అనిపిస్తున్నాయి.

ఏం చెయ్యను?

నా వయసుతో వచ్చిన అనుభవాలు బాధ్య తల్ని నేర్పాయి కానీ, యిలాంటి వ్యక్తిగతమైన బాధల్ని తట్టుకునే ధైర్యాన్ని యివ్వలేక పోయాయి.

ఇలాంటి పరిస్థితిని యింతవరకు ఎదుర్కోకపోవడం ఓ కారణం!

ఐనా నన్ను నేను సమాధానపరుచుకోవడం కోసం ఎంతో ప్రయత్నిస్తున్నాను. ఎంత ప్రయత్నించినా నా మనస్సు సంతృప్తిచెందడం లేదు. ఒక్కోసారి అనుకుంటూ వుంటాను - చిన్న చిన్న సమస్యల్ని భూతద్దంలో చూసుకొని భయపడుతున్నానేమోనని, అంతలోనే అనిపిస్తుంది.

అది భయం కాదూ... బాధ అని.

నన్ను నన్నుగా గుర్తించడం లేదనే బాధ.

అలా నాలో నేను, నన్ను నేను తర్కించుకుంటూ నడుస్తుంటే కాలికి రాయి తగిలిన బాధకి కిందకి చూశాను. బొటన వేలి పొర లేచింది. దెబ్బ చిన్నదే అయినా నరాలన్నీ ఒక్కసారిగా జివ్వుమని లాగేశాయి. ఆ బాధ తట్టుకోలేక అక్కడే కూర్చుండిపోయాను. నన్ను చూసి మనుమరాలు హారిక కంగారుపడిపోయింది.

దాని కంగారు చూస్తుంటే నా ఆత్మీయులంతా దానిలోనే ఉన్నారనిపించింది.

"తాతయ్యా! దెబ్బ గట్టిగా తగిలిందా ?" అంటూ గబగబా నా కాలు పట్టుకుని చూస్తోంది.

"ఫర్వాలేదమ్మా ! చిన్న దెబ్బ. అదే తగ్గిపోతుంది" అంటూ దాని చెయ్యిపట్టుకొని పైకి లేచాను.

ఎదురుగా నా చిరకాల మిత్రుడు సీతారామయ్య నన్నే చూస్తూ నిలబడివున్నాడు.

వాడ్ని చూడగానే నా బాధంతా తీరిపోయినట్ల య్యింది.

"బాగున్నావా? సీతారాముడూ యిప్పుడెక్కడుంటున్నావ్? కొడుకు దగ్గరా? కూతురు దగ్గరా ?" ఆప్యాయంగా భుజం మీద చెయ్యేసి అడుగుతుంటే, వాడి మొహం అదోలా అయిపోయింది.

నా ప్రశ్నలకి సమాధానంగా సీతారామయ్య నోరు తెరిచాడు.

" ఒరేయ్ సత్యం, అందరూ నీలాంటి అదృష్ట వంతులు ఉండరురా. నువ్వు రిటయిరైనా నిన్ను నిన్నుగా చూసుకునే నీవాళ్ళు చాలామంది ఉన్నారు. కానీ ఆ అదృష్టం నాకు లేదు." చెప్తూనే తల కిందికి వాల్చాడు.

వాడ్ని ఆ పరిస్థితిలో చూసిన నాకూ ఏమీ అర్థం కాలేదు.

" ఒరేయ్ సీతారాముడూ ఏమైందిరా ? చెప్పరా..." అంటూ వాడి గెడ్డం పట్టుకుని అడుగుతున్న నా చేతిమీద రెండు కన్నీటి బొట్లు పడ్డాయి.

అవి సీతారామయ్య బాధకి సంకేతాలని అర్థమయ్యింది.

గొంతు పెగుల్చుకొని చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు.

" చెప్పరా..." మళ్ళీ ఎంతో ఆత్రుతతో అన్నాను.

" ఒరేయ్ సత్యం. నేను రిటైరయ్యీ అవగానే నా కొచ్చిన ప్రావిడెంట్ ఫండ్ డబ్బుని నా కొడుకు, కూతురు కాకుల్లా పీక్కుతిన్నారు. గట్టిగా ఏమీ అనలేని పరిస్థితి. ఈ డబ్బంతా నువ్వేం చేసుకుంటావూ? నిన్ను పోషించడానికి మేమంతా లేమా? నా జీవితాంతం ఏ లోటూ రాకుండా చూసుకుంటామని ఉచిత అభయమిచ్చి నన్ను నిలువునా మోసం చేశారు. పిల్లలకు పెళ్ళిళ్లు చేసి గుండెల మీది భారాన్ని దింపుకోగలిగానని

**మనిషి అంతరాల్లో దాగి వున్న**
**మరో మనిషే రెండో మనిషి.**
**ఆ రెండో మనిషిని సరైన**
**మార్గంలో కంట్రోల్ చేసుకోకపోతే**
**ఏ మనిషైనా అదుపు**
**తప్పడమే కాదూ...**
**చుట్టు ఉన్న జీవితాలలో**
**కూడా అసంతృప్తి నింపుతాడు.**

అనుకున్నానేగాని, ఆ తర్వాతే అసలు బాధ మొదలవుతుందని ఊహించలేకపోయానురా. నా కోసం కొంత డబ్బు దాచుకొని ఉంటే నాకీ పరిస్థితి వచ్చేది కాదు. నా వాళ్ళని నమ్ముకొని నన్ను నేను అమ్ముకున్నాను. దిక్కుతోచని పరిస్థితుల్లో వాళ్ళకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నప్పుడే నీబోటి మిత్రుడు వృద్ధ శరణాలయంలో తలదాచుకునే మార్గం చూపించాడు.

చాలా రోజులుగా ఆ శరణాలయంలోనే మనశ్శాంతిగా కాలం వెళ్ళబుచ్చుతున్నానురా సత్యం. మన బిడ్డలమని, మన రక్తమని మనం మురిసిపోతాం కానీ వాళ్ళ పెరుగుదలలో చాలా మార్పులొస్తాయి. అలాగని అందరూ నా బిడ్డల్లా ఉంటారనుకోను. నా బాధలన్నీ నీకు చెప్పి నిన్ను విసిగించానేమో! ఏమీ అనుకోకురా సత్యం. మనసులో ఉన్న బాధను ఆత్మీయులతో చెప్పుకుంటే కొంతయినా తీరుతుందంటారు. అందుకేనేమో నీతో చెప్పగలిగాను. నువ్వు అదృష్టవంతుడివిరా సత్యం! మనవరాల్ని తీసుకొని ఓ తాతగా గుర్తింపుతో ఈ రోడ్డున తిరగగలుగుతున్నావు. భగవంతుడు నాకా అదృష్టం యివ్వలేదు. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుంది... వస్తానురా సత్యం... మళ్ళీ కలుద్దాం" అంటూ నన్ను ఏమీ మాట్లాడనీయకుండానే కళ్ళు తుడుచుకుంటూ సీతారామయ్య ముందుకు సాగిపోయాడు.

వాడి మాటలు విన్న తర్వాత నాలో వున్న అనుమానపు పొరలు విడిపోతున్నట్టుగా అనిపించసాగింది.

ఎందుకో నాలో ఉన్న అసంతృప్తి కరిగిపోతున్నట్లుగా ఉంది.

సీతారామయ్య చెప్పినట్లు నిజంగా నేను అదృష్ట వంతుడినా? మరి ఇంట్లో అందరి ప్రవర్తన మార్పుగా తోస్తుందేమిటీ? అకారణంగా నేనే వూహించుకుంటున్నానేమో. నాలో సందేహం మొదలయ్యింది. ఆలోచలతోనే ఇంట్లో అడుగుపెట్టాను. కాళ్ళు కడుక్కోమటూ రత్నం చెంబుతో నీళ్ళు తెచ్చియిచ్చింది.

ఆమెను చూశాను-

ఆమె కళ్ళల్లో యిప్పుడు ఆత్మీయత, అనురాగం కనిపిస్తోంది.

పెద్దోడు లోపల్నించి నవ్వుకొంటూ నా దగ్గరకొచ్చి నా పాదాలకు నమస్కరిస్తున్నాడు. నాకంతా ... మోమయంగా ఉంది. కంగారుగా వాడి భుజం పట్టుకుని పైకి లేపాను.

"నాన్నా! నాకు ప్రమోషన్ వచ్చింది. నన్ను దీవించండి" అంటూ నన్ను గట్టిగా కౌగిలించుకొని ఆనందంతో చుట్టేశాడు.

నా నోట మాట రావడానికి కొన్ని క్షణాలు పట్టింది.

నేను కూడా ఆనందంతో వాడ్ని గుండెలకి అదుముకున్నాను.

ఇంతలో కోడలు నవ్వుకొంటూ మా దగ్గరికి వచ్చి "మామయ్యగారూ! రేవట్నించి మీరు స్కూలుకి వెళ్ళనక్కర్లేదు. మీ మనవరాలికి రిక్షా ఏర్పాటు చేశాం" అని చెప్పింది.

ఇదంతా నాకు ఓ కలలా కనిపిస్తోంది.

నాలో నేనే ఎన్నో అనుమానాలతో వీళ్ళందరినీ ఎంతగా అపార్థం చేసుకున్నాను. నిజంగా నేనేనా ఇలా ఆలోచించింది? నేనేనా ఇలా ఊహించింది? కాదూ... కానే కాదూ!

నన్ను వివిధ రకాలుగా మానసికంగా చిత్ర... చేసి, అపార్థాలకి దారితీసింది నాలో దాగిన రెండో మనిషి! ఔను... నిజం!

నా ఊహలకి నాకే నవ్వు వచ్చింది.

మనిషి అంతరాల్లో దాగి వున్న మరో మనిషే రెండో మనిషి.

ఆ రెండో మనిషిని సరైన మార్గంలో కంట్రోల్ చేసుకోకపోతే ఏ మనిషైన అదుపు తప్పడమే కాదూ... చుట్టు ఉన్న జీవితాలలో కూడా అసంతృప్తిని నింపుతాడు.

తను మనశ్శాంతిని కోల్పోతాడు.

ఔను! నా అంతరాల్లో దాగివున్న ఆ రెండో మనిషిని అపార్థాల కంచెలోకి దారితీయకుండా జాగ్రత్తపడాలని స్థిర నిశ్చయం తీసుకొన్నాను.

●